క్లుప్తంగా

8 నుంచి ముత్యాలమ్మ తల్లి జాతర మహోత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

రణస్థలం: జె.ఆర్.పురం పంచాయతీ పరిధిలోని గ్యాస్ గోదాము వెనుక ఉన్న ముత్యాలమ్మ తల్లి అమ్మవారి జాతర ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ శంకర్‌నారాయణ. పక్కనే విశ్వనాథశర్మ

శ్రీకాకుళం న్యూకాలనీ: యువతరం అందుబాటులో ఉన్న టెక్నాలజీని అందిపుచ్చుకుని జీవితానికి ఉపయుక్తంగా మలచుకోవాలని రాజాం జీఎంఆర్ ఐటీ సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సీహెచ్ విశ్వనాథశర్మ పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో కొత్త సాంకేతిక పరిజ్ఞానాలపై గెస్ట్ లెక్చర్ సిరీస్‌లో భాగంగా 'ఏఐ టూల్స్, వాటి అప్లికేషన్స్' అనే అంశంపై ప్రసంగించారు. వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వనాథశర్మ మాట్లాడుతూ నేటి కాలంలో కృత్రిమ మేధస్సు ప్రాముఖ్యత ఎంతగానో విస్తరించిందన్నారు. అన్ని రంగాలలో ఏఐ అనువర్తనం చెందిందన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ అధ్యాపకులు ఐ.శ్రీలక్ష్మి, డాక్టర్ ఎస్.వాణి కుమారి, వి.శైలజ, ఎస్.మాధవీలత, ఎస్.పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీలకు ఎంపిక



శివచరణ్

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో సీఎస్‌ఈ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎండ శివచరణ్ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. విజయనగరం జిల్లా కొండవెలగాడలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని అండర్-20 విభాగంలో 72 కిలోల గ్రీకోరామన్ విభాగంలో ప్రతిభ కనబరిచాడు. ఈ నెల 5, 6వ తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగే రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, అధ్యాపకులు అభినందించారు.

8న రక్తదాన శిబిరం

రణస్థలం: అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు సందర్భంగా ఈ నెల 8న రణస్థలంలోని సూర్య ఆసుపత్రి ఆవరణంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు అభిమానులు ఒక ప్రకటనలో తెలిపారు. భారీ స్థాయిలో అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మే 15 నుంచి ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): తిరుపతి నగరంలో మే 15 నుంచి 18వ తేదీ వరకు జరిగే ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మొజ్జాడ యుగంధర్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలో సీపీఐ కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 29 రాష్ట్రాల నుంచి జాతీయ మహాసభలకు ప్రతినిధులుగా హాజరవుతారని పేర్కొన్నారు. మే 15న వేలాది మంది యువతతో ర్యాలీ, బహిరంగ సభ, 16 నుంచి 18 వరకు ప్రతినిధుల సభ నిర్వహిస్తామని తెలిపారు. సంఘ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తానన్న ప్రధాని మోదీ హామీని గాలికొదిలేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు అరవింద్, వాసు, క్రాంతి, హరి పాల్గొన్నారు.

సంప్రదాయ గురుకులంలో వేసవి శిక్షణ తరగతులు

శ్రీకాకుళం రూరల్: కల్లేపల్లిలోని సంప్రదాయ గురుకులంలో వెంకటేశ్వర యూనివర్సిటీ(తిరుపతి) ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యం, కర్ణాటక శాస్త్రీయ సంగీతంలో వేసవి శిక్షణా తరగతులను మే 1 నుంచి జూన్ 6 వరకూ నిర్వహించనున్నట్లు డైరెక్టర్ స్వాతి సోమనాథ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దూర ప్రాంత విద్యార్థులకు భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 98491 07426 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వేడుకలకు వేళాయె..!



పాలకొండ రోడ్డులోని కోదండరామాలయం

- శ్రీరామనవమి ఉత్సవాలకు సర్వం సిద్ధం
- రేపటి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి
- ముస్తాబైన కోదండ రామాలయం

శ్రీకాకుళం కల్చరల్: హిందూ సంప్రదాయంలో అతి ముఖ్యమైన పండుగ ఉగాది తర్వాత వచ్చే తొలి ఉత్సవం శ్రీరామనవమి. చైత్రశుద్ధ నవమి నాడు దాదాపు అన్ని రామాలయాలల్లోనూ సీతారాముల కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. చైత్రమాసం ప్రారంభం కాగానే ఉగాది నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించేవారు కొందరైతే, శ్రీరామనవమి నుంచి తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించేవారు మరికొందరు. ఉగాది నుంచి ఉత్సవాలు జరిపేవారు శ్రీరామ వసంతోత్సవాల పేరిట, నవమి నుంచి ఉత్సవాలు చేసే వారు నవరాత్రి ఉత్సవాల పేరిట పండగను ఘనంగా నిర్వహిస్తారు. ఈ క్రమంలో ఏడాది కూడా శ్రీరామనవతి ఉత్సవాలకు జిల్లా కేంద్రంలోని ప్రఖ్యాత కోదండ రామాలయం ముస్తాబైంది.



ఆలయ గోపురం

200 ఏళ్ల చరిత్ర..

పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయం 200 ఏళ్ల క్రితం నిర్మించినట్లు చెబుతుంటారు. అప్పటి భక్తులు అద్దమణుగుల వెంకన్నపంతులు, వెంకటరత్నమ్మ దంపతులు 1826లో ఈ ఆలయం నిర్మించగా ఇక్కడి మూలవిరాట్ ఒక ప్రత్యేకత ఉంది. అన్ని ఆలయాలలో విగ్రహాలు నల్లరాతితో తయారు చేసినవైతే ఇక్కడి సీతారామ, లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహాలు పాలరాతితో తయారు చేయించారు. వీటిని అయోధ్య నుంచి నాటు బళ్లపై ఇక్కడికి తెప్పించినట్లు పూర్వీకుల కథనం.



కోదండ రామాలయంలోని సీతారాముల పాలరాతి విగ్రహాలు



బొందిలీపురంలోని సీతారాముల విగ్రహాలు

ఇవీ కార్యక్రమాలు..

కోదండ రామాలయంలో ఈ నెల 6న శ్రీరామనవమి సందర్భంగా శ్రీరామ జనన ఘట్ట పారాయణ ఉంటుంది. అనంతరం దనాన రామారావు బృందం సంగీత విభావరి నిర్వహిస్తారు.7వ తేదీ సాయంత్రం నిత్య కైంకర్యం, 8న స్వామివారికి వార్షిక కల్యాణ వేడుకలు, అదే రోజు సాయంత్రం స్వామివారి తిరువీధి అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. 9న చూర్ణోత్సవం, 10న రథోత్సవం, తిరువీధి, 11న ధూపోత్సవం, 12న శ్రీరామ పట్టాభిషేకం, రామదర్బార్, 13న పాలికోద్వాసన, పుష్పయాగం, ద్వాదశ తిరువారాధనతో వేడుకలు ముగుస్తాయని ఈవో సర్వేశ్వరరావు తెలిపారు.

ఉత్సవాలకు సిద్ధం

కోదండ రామాలయం అతి పురాతన దేవాలయం. ఇక్కడి విగ్రహాలు పాలరాతితో తయారు చేయడం విశేషం. నిత్య పూజలు జరుగుతున్నాయి. శ్రీరామనవమి ఉత్సవాల కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి.

– బంకుపల్లి శేషాచార్యులు, అర్చకులు, కోదండ రామాలయం

ముస్తాబవుతున్న మందిరాలు..

- స్థానిక పుణ్యపు వీధిలోని సీతారామచంద్ర మూర్తి సహిత సువర్చల అభయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామ నవమి ఉత్సవాల కోసం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.
- బలగలోని హరేరామ మందిరంలో సీతారాముల కల్యాణోత్సవాల కోసం దంపతులతో సామూహికంగా పూజలు నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.
- మంగువారితోటలోని సీతారామచంద్రమూర్తి ఆలయం, తుమ్మావీధిలోని శ్రీరామమందిరం, మండలవీధిలోని శ్రీగరిటి పోలమ్మ, రామ మందిర ఆలయం, ఫాజుల్‌బాగ్ పేటలోని శ్రీరామమందిరం, మహాలక్ష్మీనగర్ కాలనీలోని శ్రీరామమందిరం, పాండురంగవీధిలోని రామ మందిరం, దమ్మలవీధిలోని హనుమాన్ కూడలి, స్వరంగడోల వీధిలో బోర శ్రీరాములు రామమందిరం వద్ద కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. రామ మందిరాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు.

కోదండ రామాలయం వద్ద పందిరి రాట వేస్తున్న భక్తులు, అర్చకులు



ఘనంగా పందిరి రాట

శ్రీకాకుళం కల్చరల్/గార: శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా పలుచోట్ల రామాలయాల వద్ద శుక్రవారం పందిరి రాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయంలో ఈవో సర్వేశ్వరరావు, అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో పందిరిరాట ముహూర్తం చేసి పూజలు నిర్వహించారు. ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకు వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు. గార మండలం జొన్నలపాడు కాలనీలోని శ్రీరామ మందిరం వద్ద శుక్రవారం ఉదయం పందిరి రాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.



గార: జొన్నలపాడు కాలనీలో పందిరి రాట వేస్తున్న భక్తులు



రామస్థంభం

వైఎస్సార్ సీపీ మండల కమిటీల నియామకం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గంలో శ్రీకాకుళం రూరల్, గార మండలాల వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ కమిటీలను అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

శ్రీకాకుళం రూరల్ మండలం:

– ఉపాధ్యక్షులుగా రుప్ప అప్పలసూరి, లోలుగు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శులుగా కంచు వసంతరావు, గంగు నరేంద్ర, ఊటపల్లి కృష్ణ, నీలంశెట్టి రామకృష్ణ, కార్యదర్శులుగా కరణం శ్రీనివాసరావు, బగాది మనోజ్‌కుమార్, పెద్దిన ఉమామహేశ్వరరావు, యాగాటి లక్ష్మణరావు, పొన్నాన కోటేశ్వరి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కుంచాల భాస్కరరావు, గుండ రమేష్, కర్రి కాంతారావు, బోర రమణయ్య, పొట్నూరు గోవిందరావు, బలగ గోపి, జరుగుళ్ల విశ్వనాథం, ఇనుముల జనార్దనరావు, కింజరాపు రాంబాబు, మొదలవలస రమణ, కుంచాల రాజశేఖర్, పెంట సాయిబాబు, చీకటి గురుమూర్తి, కనుగుల వెంకటఅప్పారావు, రంది వాసు, బాన్న రామకృష్ణ నియమితులయ్యారు.

గార మండలం..

పార్టీ ఉపాధ్యక్షులుగా గుంట రామచంద్రరావు, రంగాల వెంకటరావు, ప్రధాన కార్యదర్శులుగా గుజ్జల రామారావు, కిల్లి రఘు, బోర కోటేశ్వరరావు, మల్ల మాధవనాయుడు, కార్యదర్శులుగా సారధి రమణ, చల్ల జగన్నాథం, నైరెడ్డెల గణేష్, గుజ్జల అన్నపూర్ణ, చింతాడ గడ్డెయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బూరగాపు ఉషారావు, దీర్ఘాసి వీర్రాజ్, పుల్లటి మధు, సతివాడ ఆదిలక్ష్మి, కరజాడ లచ్చన్నాయుడు, తాన్నె రమణ, బుగత రాజారావు, కసిం సత్యనారాయణ, పల్ల శ్రీనివాసరావు, బట్న ధర్మారావు, గొలివి గోవిందరావు, మైలపల్లి ధానేష్, ఆరంగి శ్రీనివాసరావు, అంబటి హిమబిందు, వంజరాపు లక్ష్మణరావు నియమితులయ్యారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో కొనసాగుతున్న ధర్నా



ధర్నా చేస్తున్న ఈయూ నాయకులు, సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలోని నాలుగు డిపోల ఉద్యోగులకు 1/19 సర్క్యులర్‌ను ఆర్టీసీ అధికారులు అమలు చేయాలని, పలాస డిపో పరిధి కండక్టర్ ఎస్.నీలకంఠం సస్పెన్షన్‌ను రద్దు చేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో రెండో రోజైన శుక్రవారం కూడా ఈయూ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జోనల్ కార్యదర్శి బి.కె.మూర్తి, యూనియన్ నేత ఎస్.వి.రమణలు మాట్లాడుతూ నీలకంఠంను తిరిగి విధుల్లోకి తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు.

ఉద్యోగులపై కక్షసాధింపు చర్యలు వీడాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.రామకృష్ణ, కె.బాబూరావు, సీహెచ్.బాబు, బి.ఆనందరావు, ఎస్.లక్ష్మణరావు, బి.ఎస్.బాబు, ఎస్.జోగారావు, ఎస్.ఎస్.నారాయణ, ఎస్.రమణ, పి.కె.రావు, ఎ.వి.ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆయుష్ సేవలపై ఆరా



సేవలు పరిశీలిస్తున్న కేంద్ర బృందం

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామంలో 'ఆయుష్ మందిర్' ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర నాణ్యతా ప్రమాణాల బృందం పరిశీలించింది. జిల్లా నాణ్యత అధికారి ఎం.రవికుమార్‌తో అన్ని విభాగాలు సందర్శించి కలిసి సౌకర్యాలపై ఆరా తీశారు. ఇక్కడ అందిస్తున్న సేవలను వైద్యులు యశ్వంత్, సుమ వివరించారు. కార్యక్రమంలో నేషనల్ ఎసెస్స్ డాక్టర్ అరస్, డాక్టర్ తపాన్ రంజన్ ప్రధాన్, సర్పంచ్ పున్నాన సోనియా, ఎంపీటీసీ మక్క శ్రీలత, గ్రామనీటి సంఘం అధ్యక్షులు మీసాల విజయలక్ష్మి, నాయకులు మక్కా నారాయణరావు, పున్నాన అక్కలనాయుడు, మక్క శ్రీనివాసరావు, సీహెచ్‌వో కె.శివప్రసాదరావు, ఎంఎల్‌హెచ్‌పీ సుభాషిణి, ఏఎన్‌ఎం భవానీ సిబ్బంది పాల్గొన్నారు.

యుగు పురుషుడు శ్రీరామచంద్రుడు

శ్రీకాకుళం కల్చరల్: జనచైతన్య స్వరూపానికి కారకుడైన శ్రీరామచంద్రమూర్తి యుగ పురుషుడని సుసరాపు చంద్రశేఖర్ శర్మ అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో జరుగుతున్న శ్రీరామ వసంత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 'భక్త సులభుడు శ్రీరాముడు' అనే అంశంపై శుక్రవారం ప్రసంగించారు. పెద్దల పట్ల ఎలా ప్రవర్తించాలి, స్త్రీలను ఎలా గౌరవించాలి, మూగజీవాలను ఎలా ఉద్ధరించాలో ఆచరణలో చూపిన వ్యక్తి శ్రీరాముడని పేర్కొన్నారు. కార్యక్రమంలో కప్పగంతుల రమణారావు, ఈశ్వరరావు, వెంకటరమణ, సనపల నారాయణమూర్తి, సూర్యారావు, ప్రసాద్, కామేశ్వరరావు, విశ్వేశ్వరరావు, జగదాంబ, సీత, లక్ష్మీ పాల్గొన్నారు.

నైపుణ్యాలతోనే ఉపాధి అవకాశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: యువతలో నైపుణ్యాలు కీలకమని ఎచ్చెర్లలోని శ్రీ వేంకటేశ్వరా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌సీవీ రమణమూర్తినాయుడు అన్నారు. కళాశాలలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఏరో విజన్ డ్రోన్ ల్యాబ్ వర్చువల్ సమావేశంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విజన్ డ్రోన్ ల్యాబ్ కళాశాలలో నిర్వహించి సాంకేతికతపై శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు.

ఉగాది పురస్కార గ్రహీతకు సత్కారం



రామకౌండిన్యను సన్మానిస్తున్న గ్రామస్తులు

గార: శ్రీకూర్మం గ్రామానికి చెందిన కూచిపూడి నృత్య కళాకారుడు శ్రీభాష్యం సుందర రామకౌండిన్య ఈ ఏడాది ఉగాది పురస్కారం అందుకోవడంతో అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పురస్కారం అందుకొని శ్రీకూర్మంకు చేరుకోవడంతో గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. తల్లిదండ్రులు శ్రీభాష్యం ధన్వంతరి, శ్రీ భాష్యం ధనలక్ష్మీతో పాటు రామకౌండిన్యను దుశ్శాలువ, పుష్పగుచ్చాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బరాటం నాగేశ్వరరావు, అంధవరపు బాలకృష్ణమూర్తి, అప్పలనాయుడు, అనుపోజు నాగరాజు, టీపీ కూర్మాచార్యులు, టీపీ శ్రీనుబాబు, గురయ్య, కె.రమేష్, పల్ల రాధ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపురం కుడికాలువ సమస్య పరిష్కరించాలి



మాట్లాడుతున్న పంచిరెడ్డి కృష్ణారావు

ఎచ్చెర్ల క్యాంపస్: నారాయణపురం కుడికాలువ సమస్య పరిష్కరించి రానున్న ఖరీఫ్‌కు సజావుగా సాగునీరు అందజేయాలని నారాయణపురం ఆయకట్టు ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు కోరారు. సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులతో కలిసి శుక్రవారం పొన్నాడలో విలేకరులతో మాట్లాడారు. సాగునీటి విషయమై కింతలి సెక్షన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కొత్తకోట రాంబాబును కలిసి వినతి పత్రం అందజేసినట్లు చెప్పారు. కొంగరాం, ధర్మవరం, దుప్పలవలస, పొన్నాడ సాగునీటి వినియోగ సంఘాల పరిధిలో సమస్యలు వివరించామని తెలిపారు. ఈ ఖరీఫ్‌కైనా ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుల దృష్టికి సైతం తీసుకువెళ్లినట్లు వివరించారు. పూడికలు, గుర్రపు డెక్క తొలగింపు, షట్టర్లు, మదుముల నిర్మాణాలు చేపడితేనే సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సాగునీటి సంఘాల వినియోగదారుల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

13న గురుకుల ప్రవేశ పరీక్ష

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాలలో ప్రవేశానికి ఈ నెల 13న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు దుప్పలవలస ప్రిన్సిపాల్ బోర బుచ్చిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఐదో తరగతి, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్మీడియెట్ ఫస్టియర్ ప్రవేశ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



నాగావళి తీరాన బలగ బాలా త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీరామ నవమి ఉత్సవాలు, లలితాదేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణేష్ గురూజీ ఆధ్వర్యంలో సీతారాముల విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు జరిపించారు.

-శ్రీకాకుళం కల్చరల్

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన



నగరంలోని పీఎన్ కాలనీ పార్కులో యోగా సెంటర్ సభ్యులు శుక్రవారం ముందస్తు శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పాగిరి సుగుణాకరరావు ఆధ్వర్యంలో యోగా టీచర్ కరుటూరి నాగలక్ష్మి పర్యవేక్షణలో కోలాట ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో యోగా గురువులు ఎం.వి.రామారావు, మావూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాకుళం కల్చరల్

సంతోషిమాత ఆలయంలో హోమం



పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా చైత్ర శుద్ధ సప్తమి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధర్వర్యంలో మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. లలితా సహస్ర నామ పారాయణ హోమం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- శ్రీకాకుళం కల్చరల్

దంత సమస్యలపై అశ్రద్ధ తగదు



దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో శుక్రవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నగరంలోని 'ఆపిల్ ఇంటర్నేషనల్ డెంటల్ హాస్పిటల్' నిర్వాహకులు విచ్చేసి విద్యార్థినులు, అధ్యాపకులకు దంత పరీక్షలు చేపట్టారు. సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ నిహారిక, డాక్టర్ చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకర్‌నారాయణ, కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, జువాలజీ విభాగ అధ్యాపకులు ఐ.హేమాపద్మజ, డాక్టర్ వై.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.